


23న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి

● డీఈవో రవీందర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21 : ఈ నెల 23వ తేదీన అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. సమావేశ సమాచారాన్ని తల్లిదండ్రులకు ముందుగా తెలియజేయాలన్నారు. సమావేశంలో విద్యార్థుల నమోదు పెంచేలా వారి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ప్రగతి పత్రాలపై సంతకం తీసుకోవాలని, విద్యార్థులకు అందజేయాలన్నారు.



ఉపాధిపై నిర్లక్ష్యం



- ఉపాధి హామీపై జిల్లాలో కొరవడుతున్న పర్యవేక్షణ
- క్షేత్రస్థాయిలో కూలీలకు నీడ, నీటి సౌకర్యం కరువు
- గ్రామ పంచాయతీ అధికారులదే బాధ్యత అంటూ తప్పించుకుంటున్న ఉపాధి హామీ సిబ్బంది
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఉన్నతాధికారులకు మాత్రం సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెబుతున్న సిబ్బంది

(ఖానాపూర్, ఏప్రిల్ 21)

నిరుపేద ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పురుడు పోసుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై అధికారుల పర్యవేక్షణ కొరవడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ పనికి వెళ్లే కూలీలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించని చందంగా.. ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తుండడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ ఎండలు మండుతున్న క్రమంలో ఉపాధి హామీ పనికి వెళ్తున్న కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. క్షేత్ర స్థాయిలో మాత్రం అది అమలు కావడం లేదని కూలీలు చెబుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించకపోగా.. అధికారులకు మాత్రం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సిబ్బంది చెబుతుండడం పలు విమర్శలకు తావిస్తోంది.



తర్లపాడ్‌లో అడవిలో ఉపాధి హామీ పని చేసేందుకు వెళ్తూ మార్గమధ్యలో నీరసించి కూర్చున్న మహిళ

● కరువవుతున్న నీడ, నీటి సౌకర్యం

ఖానాపూర్ మండలంలో 8,639 జాబ్ కార్డులు ఉండగా.. 13,717 మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో కలిపి 8,977 మంది కూలీలు నిత్యం ఉపాధి హామీ పనికి వెళ్తున్నారు. కాగా పని ప్రదేశంలో కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తుండడంతో.. తెల్లవారిందే మొదలు వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది. ఈ నేపథ్యంలో వాతావరణంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనికి వెళ్తున్న కూలీలు ఎండలోనే పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం పని ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించాలని నిబంధనలు ఉన్నప్పటికీ మండలంలో ఎక్కడ కూడా ఉపాధి హామీ పని నిర్వహించే ప్రాంతంలో టెంట్ సౌకర్యం కల్పించడం లేదని చెబుతున్నారు. పని చేసిన కూలీలు టెంట్ కింద సేద తీరేలా నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పని ప్రదేశంలో చల్లటి నీరును ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్న దానిని కూడా తుంగలో తొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు ఎండలో పని చేసిన తమకు ఒంట్లోంచి చెమట రూపంలో నీరు బయటకు వెళ్తున్నందున పని ముగిసే సమయానికి డిహైడ్రేషన్ బారిన పడుతున్నామని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచితే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.



తర్లపాడ్ అడవుల్లో నీడ సౌకర్యం లేక ఎండలోనే కూర్చుని సేద తీరుతున్న ఉపాధి హామీ కూలీలు

● భారమవుతున్న దూరం

జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశాలు గ్రామాలకు సుమారు నాలుగు నుంచి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉండడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటవీ ప్రాంతంలో పనులు కొనసాగిస్తుండడంతో.. వాహనాలలో సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశానికి ఆటోలు మాట్లాడుకుని వెళ్తే రాకపోకల కోసం నిత్యం 40 నుంచి 50 రూపాయలు వెచ్చించాల్సి వస్తుందని కూలీలు చెబుతున్నారు. నిత్యం డబ్బులు పెట్టే పరిస్థితిలో లేనివారు పని ప్రదేశానికి నడిచి వెళ్లడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వాహన సౌకర్యం కల్పించాలని అడిగితే నిత్యం 10 నుంచి 15 రూపాయలు వచ్చేలా మాస్టర్‌లో రాస్తామని అధికారులు చెబుతున్నారని.. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పని ప్రదేశానికి వెళ్లేందుకు 50 రూపాయల వరకు ఖర్చు అవుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు దూర భారాన్ని తగ్గించడంతో పాటు పని ప్రదేశంలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

పని ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు..

కలమడుగు లక్ష్మణ్ (ఉపాధి కూలీ, తర్లపాడ్)



ఈ ఏడాది ఉపాధి హామీ పని ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు పని ప్రదేశంలో నీళ్ల సౌకర్యం గానీ నీడ సౌకర్యం గానీ కల్పించడం లేదు. గ్రామం నుంచి అడవిలోకి ఐదు కిలో మీటర్ల పైగా వెళ్లి పనులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో రాకపోకలకు కూలీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గత వారం పని ప్రదేశానికి నడిచి వెళ్లిన ఓ మహిళ మార్గమధ్యలోనే పడిపోవడంతో ఆటోలో ఆసుపత్రికి తరలించాం. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి. దూర భారం తగ్గించని క్రమంలో కనీసం రాకపోకలకైనా చార్జీలను పెంచాలి.

క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం

● సునీత (ఎంపీడీవో, ఖానాపూర్)

ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచిస్తున్నాం. తమకు మాత్రం పని ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారని క్షేత్రస్థాయిలో వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉంటే ఖచ్చితంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి సంబంధిత సిబ్బందిపై చర్యలు చేపడతాం.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

● పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

మామడ, ఏప్రిల్ 21: మండలంలోని కొరిటికల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దత్తసాయి దేవాలయంలో ఆదివారం సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ నల్ల లింగారెడ్డి, సాయిబాబా విగ్రహ దాత లక్కడి జగన్మోహన్ రెడ్డిల నేతృత్వంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని గోపాలకృష్ణ మఠాధిపతి అయిన యోగానంద సరస్వతి, నిర్మల్‌కు చెందిన ప్రముఖ వేద పండితులు గురుమంచి చంద్రశేఖర్ శర్మలు ప్రతిష్ఠాపనకు సంబంధించిన పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ నల్ల లింగారెడ్డి మాట్లాడుతూ... సీజీఎస్ నిధులు రూ. 25 లక్షలు వెచ్చించి ఇక్కడ ఆలయాన్ని నిర్మించామన్నారు. ఆలయంలో ప్రతిష్ఠించిన సాయిబాబా విగ్రహాన్ని రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నుంచి తెప్పించామన్నారు. దాదాపు రెండు లక్షల విలువ గల ఈ సాయినాథుడి విగ్రహాన్ని సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా విగ్రహ దాత అయిన జగన్మోహన్ రెడ్డికి గ్రామస్థుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకోవడానికి క్యూలో నిల్చున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన అడెల్లి

సారంగాపూర్, ఏప్రిల్ 21 : మండలంలోని అడెల్లి మహా పోచమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిలాడింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుండి కాకుండా మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై ఆలయంలో మొక్కులను మొక్కి అమ్మవారికి పెరుగన్నంను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్ గౌడ్‌లు అన్ని చర్యలు తీసుకున్నారు.

కవి సమ్మేళనంలో పాల్గొన్న నిర్మల్ కవులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన భవనంలో ఆదివారం నిర్వహించిన 12 గంటల కవి సమ్మేళనంలో నిర్మల్ తెలంగాణ రచయితల వేదిక కవులు నేరెళ్ల హనుమంతు, అంబటి నారాయణ పాల్గొని కవితలు వినిపించారు. ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణపై సెక్యులర్ ఫోరం ఆధ్వర్యంలో సమ్మేళనం జరిగింది.

హామీలన్నీ నెరవేరుస్తాం : మంత్రి సీతక్క

ముథోల్, ఏప్రిల్ 21: ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి చేస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పేదింటి ఆదివాసి ఆడబిడ్డ ఆత్రం సుగుణను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అన్ని నెరవేర్చి తీరుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారన్నారు. పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ పేదింటి హక్కుల కార్యకర్తగా పేద ప్రజల మేలు కోరే వ్యక్తి అని అన్నారు. అధిక మెజార్టీతోని గెలిపిస్తే అక్షరంలో అగ్రగామిగా అభివృద్ధిలో వెనుకబడిన ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నారాయణ రావు పటేల్, విఠల్ రెడ్డి, రేఖానాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, గంగారెడ్డి, అజీజ్, ఖలీద్, దిగంబర్, అఫ్రోజ్ ఖాన్, ఎజాజొద్దీన్, అనిల్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● 'రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

తానూర్: మండలంలోని సింగన్‌గావ్, జౌల(బి) గ్రామంలో ఆదివారం నిర్వహించిన డా.బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం అవుతుందన్నారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలోనే పేదలకు నిత్యావసర సరుకులకు జీఎస్టీ విధించి పేదల నడ్డి విరించిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నారాయణ్‌రావు పాటిల్, విఠల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఓం ప్రకాష్‌లడ్డా, శంకర్‌చంద్రే, బాశెట్టి రాజన్న, పీఏసీఎస్ ఛైర్మన్ నారాయణ్‌రావుపాటిల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుండ్లీక్, తదితరులున్నారు.

● 'బాసర ఆలయంలో అవినీతిపరులపై చర్యలు తీసుకోండి'

బాసర: బాసర సరస్వతీ దేవస్థానంలో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్కకు బాసర గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. అమ్మవారి ఆలయంలో నిత్యావసర సరుకుల కొనుగోలు విషయంలో కొందరు అధికారులకు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ విజిలెన్స్ విచారణలో అక్రమాలు తేలినప్పటికి అధికారులు మాత్రం బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఆలయ ఈవోతో పాటు ఆలయ ఏఈవో, సూపరింటెండెంట్‌లు భారీ అవకతవకలకు పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత పదేళ్ల నుంచి ఏడాదికి రూ.3 నుంచి 4 కోట్ల అమ్మవారి నిధులు పక్కదారి పట్టాయని అన్నారు. బాధ్యులపై చర్య తీసుకోకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బాసర దేవస్థానంలో నిత్యావసర వస్తువుల కొనుగోళ్ల అక్రమాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇందులో మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఖలీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లయ్య యాదవ్, రాజు దేశాయ్, జంగం రాజేందర్, తదితరులు ఉన్నారు.



ముథోల్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న బాసర గ్రామస్థులు

ఎన్నికల్లో లబ్ధి కోసమే రుణమాఫీ ప్రకటన

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

భైంసా, ఏప్రిల్ 21: హామీల అమలులో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆగస్టులో రైతుల రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటన చేసారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు.ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్, బీజేపీ జిల్లా ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగు నెలలుగా రుణమాఫీపై స్పందించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోక్‌సభ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో రుణమాఫీపై ప్రకటన చేయడం కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసమేనని అన్నారు. ఎన్నికల కంటే ముందే ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టగానే రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయని కాంగ్రెస్ సర్కార్ ఆగస్టులో చేస్తుందన్న నమ్మకం ఏంటని ప్రశ్నించారు. ప్రజలకు మోసగించే రీతిలో పాలన కొనసాగించిన బీఆర్ఎస్‌కు గుణపాఠం నేర్పిన ప్రజానీకం అదేరీతిలో పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం నేర్పి బీజేపీకి పట్టడం ఖాయమన్నారు.

● 24న గెడం నగేష్ నామినేషన్

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా గెడం నగేష్ ఈ నెల 24న నామినేషన్ వేయనున్నట్లుగా ఎమ్మెల్యే పాయల శంకర్ వెల్లడించారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఉమ్మడి జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌లో నామినేషన్ ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్, పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రతినిధులు సాంప్లీ రమేష్, సామ రాజేశ్వర్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్



డాక్టర్ చంద్రిక

మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ ఫైనల్స్‌కు డాక్టర్ చంద్రిక ఎంపిక

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 21: నిర్మల్‌కు చెందిన స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక అవినాష్ మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన పోటీల్లో 50 మంది పాల్గొనగా తెలంగాణ రాష్ట్రం నుంచి చంద్రిక ఫైనల్స్‌కు అర్హత సాధించారు. ఈ మేరకు ఆమె మే 28 నుంచి జూన్ 1 వరకు గుర్గావ్, ఢిల్లీలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ ఘనతను సాధించిన డాక్టర్ చంద్రికను నిర్మల్‌కు చెందిన పలువురు అభినందించారు.

మానవ హక్కుల సంఘ ఉపాధ్యక్షుడిగా సుభాష్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21: నిర్మల్ జిల్లా మానవ హక్కుల సంఘ ఉపాధ్యక్షుడిగా పల్లి సుభాష్ నియమితులయ్యారు. ఆదివారం స్టేట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ కారక్రమంలో నాయకులు అబ్దుల్ సాదిక్, అబ్దుల్ రఫ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా రాజేశ్వర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21 : హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ సేవాదళ్ విస్తృత స్థాయి సమావేశంలో నిర్మల్‌కు చెందిన ఎంబడి రాజేశ్వర్‌ను ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ సేవాదళ్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. రాష్ట్ర సేవాదళ్ ఇన్‌చార్జి అధ్యక్షుడు సగ్గురాం, రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. రాజేశ్వర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి'

కుభీర్, ఏప్రిల్ 11: బీజేపీతోనే దేశాబివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే రామరావుపాటిల్ అన్నారు. ఆదివారం మండలంలోని జాంగాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ తాజా మాజీ ఉప సర్పంచ్ గణేష్ బీజేపీ పార్టీలోకి చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ అభ్యర్థి గేడం నాగేష్‌ను బారీ మెజారిటీతో గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏశాల దత్తాత్రి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే దేశం పురోగతి



దేగాంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భైంసా రూరల్, ఏప్రిల్ 21 : మండలంలోని దేగాం గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ప్రధాని మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ నాయకులు అన్నారు. భైంసా మండలంలోని దేగాం గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి నగేష్‌కు ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ నాయకత్వంలో గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామని తెలిపారు. అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడితే ఊర్కునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బీజేపీ నాయకులు అన్ని వేళలా అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ దేగాం గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, భైంసా మండల ప్రముఖ నాయకులు పండిత్ రావు పటేల్, మండల మోర్చా మహిళా అధ్యక్షురాలు ఎస్. సుష్మ రెడ్డి, స్థానిక నాయకులు కిష్టన్న, చంద్రకాంత్ పటేల్, మాజీ ఉప సర్పంచ్ ఎల్లప్ప, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నంద కుమార్‌తో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొంగు చాచి అడుగుతున్నా..ఆశీర్వదించి గెలిపించండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ

ముథోల్,ఏప్రిల్ 21:ఆదివాసి పేదింటి ఆడబిడ్డగా కొంగుచాచి అడుగు తున్న నన్ను ఆశీర్వదించి గెలిపించండి అని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్ల మెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ కోరారు. మండల కేంద్రమైన ముథోల్‌లో ఆది వారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గెలిపించి ప్రశ్నించే గొంతుకగా పార్లమెంట్‌కు పంపితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సాయశక్తులా సమస్యల పరిష్కా రానికి ముందుంటానని కోరారు. ఒక పేదింటి ఆడబిడ్డగా ఆదివాసి బిడ్డగా కాంగ్రెస్ పార్టీ నన్ను ఆదరించి పేద, ధనిక, సీనియర్, జూనియర్ తేడా చూడకుండా టికెట్ ఇచ్చిందన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలందరూ తమకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రజల పక్షాన ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఒక ఫోన్ కాల్ చేస్తే స్పందిస్తానని పేర్కొ న్నారు. ఇదివరకు కూడా పేద ప్రజల కోసం ముందుండి కొట్లాడిన వ్యక్తిగా ఇప్పుడు ఆదిలా బాద్ పారమెంట్ స్థానం నుంచి తమకు పట్టం కట్టి పార్లమెంట్‌కు పంపి నట్లయితే ఉమ్మడి జిల్లాలోని నలుమూలలలో ఉన్న సమస్యలు పరిష్కారయే ధ్యేయంగా ముందుకెళ్తానని పేర్కొన్నారు. అభి వృద్ధిలో వెనుకబడిన నాముథోల్ ప్రాంతం అభివృద్ధికి పాటుపడుతానన్నారు. కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. 10 సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో చేసింది ఏమీ లేదని, కేంద్రంలో బీజేపీ సామాన్య ప్రజలకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అలాగే ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై విజయమే లక్ష్యంగా తమ గెలుపు కోసం సహకారాలు అందించాలని వేడుకున్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నారాయణ రావు పటేల్, విఠల్ రెడ్డి, రేఖా నాయక్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మండల ఇన్‌చార్జిలు, తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

ఎంపీ అభ్యర్థి విజయమే కాంగ్రెస్ లక్ష్యం

● ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఏప్రిల్ 21: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణ విజయం లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకులు పని చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గంలోని తదితర గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలతో, నాయకులతో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రజలకు వివరించాలన్నారు. రానున్నరోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఉట్నూర్ మండలంలోని శాంతినగర్ కొమ్ముగూడ, దేవానగర్, పిట్లగూడ, బోయవాడ ఐటీ కాలనీకి చెందిన టీఆర్ఎస్ బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరడంతో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతించారు. ఇదిలా ఉండగా కడెం జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డితో పాటు లక్ష్మీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ విజయ్‌రాజన్న కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణను భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖయ్యూం, ఇక్బాల్, అజీముద్దీన్, తుమ్మల మల్లేష్, సతీష్‌రెడ్డి, వెంకటేశ్, పడకొరభూషన్, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులున్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ న్యాయం

● నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతోనే అన్ని వర్గాలకు సమన్యాయం లభిస్తుందని డీసీసీ చీఫ్ కే. శ్రీహరి రావు అన్నారు. ఆదివారం లక్ష్మణచాంద మాజీ సర్పంచ్ బిట్లింగ్ నారాయణ శ్రీహరి రావు నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఆయనతో పాటు మాజీ వార్డు మెంబర్లు మంగళంపల్లి గణేష్ తదితర బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలు, భూదందాలు చోటుచేసుకున్నాయన్నారు. ప్రజా సంక్షేమం పట్టించుకోకుండా ప్రజలకు అన్యాయం చేశారన్నారు. కేసీఆర్ పాలనకు చరమగీతం పాడి ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అనతి కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అట్ల రాంరెడ్డి, రవీందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచార వాహనాల ప్రారంభం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆదివారం నిర్మల్ జడ్పీ ఛైర్‌పర్సన్ కే.విజయలక్ష్మి బీఆర్ఎస్ పార్టీ ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. కొండాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు మారుగొండ రాము, మాజీ ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ కే.రాంకిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: ఖానాపూర్ నియోజకవర్గం ఉట్నూర్ మండలంలో ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు గెలుపుకు మద్దతుగా ఎన్నికల ప్రచకార రథంను ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు ప్రారంభించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఉట్నూర్ మండల పార్టీ అధ్యక్షుడు కందుకూరి రమేష్,ఉట్నూర్ మాజీ వైస్ ఎంపీపీ ఎండీ సలీం ఉద్దీన్, సుఫియన్, పుష్పరాణి,దూటమహేందర్, సోనేరావు, కామెరిరాజు, హైమద్, అజ్జు, శ్రీకాంత్, కార్యకర్తలు తదితరులతో కలిసి ప్రచార రథంకి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కుని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణకు కేసీఆర్ రక్షణ అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే రెట్టింపు ఉత్సాహంతో పని చేద్దామని కార్యకర్తలకు నాయకులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధు లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

'ఎంపీగా గోడం నగేష్‌ను గెలిపిద్దాం'

నేరడిగొండ, ఏప్రిల్ 21: మండలంలోని లక్ష్మీపూర్, అద్దాల తిమ్మాపూర్ గ్రామాల మధ్యలో గల వినాయకుని గుడిలో పూజ అనంతరం తిమ్మాపూర్ గ్రామం నుంచి ప్రచారాన్ని ప్రారంభించి లక్ష్మీపూర్, పీచరా, గోవింద్‌పూర్, నాగమల్యాల్ గ్రామాలలో బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడంనగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మాత్రం మోదీయో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సాబ్లె సంతోష్‌సింగ్,మాజీ ఎంపీపీ ఆత్రం జ్ఞానసుద, శక్తి కేంద్ర ఇన్‌చార్జీ గట్టునారాయణ, ప్రధాన కార్యదర్శులు బంటుప్రవీణ్, ధర్మపురి రాములు, బీజేవైఎం మండల అధ్యక్షులు బాక్రె లక్ష్మణ్, పోలింగ్ బూత్ అధ్యక్షుడు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించండి'

ముథోల్, ఏప్రిల్ 21 : ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కును అధిక మెజార్టీతో గెలిపించాలని ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ముథోల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును ఆశీర్వదించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలతో పాటు రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్లడం జరిగిందన్నారు. వ్యవసాయంతో పాటు ప్రతి పల్లె అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అంతకుముందు డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీ గంగాధర్, నాయకులు మరిబా, తదితరులున్నారు.

ఊపందుకున్న ప్రచారపర్వం!

● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యూహ, ప్రతివ్యూహాలతో పార్లమెంట్ ఎన్నికల బరిలోకి ప్రధాన పార్టీలు ● 8 పర్యాయలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయం ● 6 పర్యాయలు టీడీపీ.. 2 పర్యాయలు బీఆర్ఎస్ ఖాతాలో ● ఒక పర్యాయం బీజేపీ



భైంసా, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికల జోరు క్రమక్రమంగా ఊపందుకుంటోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార పర్వాన్ని వేగవంతం చేస్తున్నారు. వచ్చే నెల 13న జరుగనున్న ఎన్నికల్లో తమ తమ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రధాన పార్టీల అధిష్ఠానాలు వ్యూహ,ప్రతి వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఇప్పటి వరకు 17 పర్యాయాలు ఎన్నికలు జరుగగా.. ఒక పర్యాయం ఉప ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం 18వ లోక్‌సభ ఎన్నికల నిర్వాహణ కోసం రంగం సిద్ధమయ్యింది.. ఇదీ వరకు ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఎన్నికల ఫలితాలు వివరాలు ఇలా ఉన్నాయి. 2008లో జరిగిన ఉప ఎన్నికతో కలుపుకొని ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి 17 పర్యాయలు ఎన్నికలు జరిగాయి.



● ఎక్కువ సార్లు కాంగ్రెస్ అభ్యర్థుల విజయం

ఆదిలాబాద్ లోక్ సభ స్థానానికి 17 పర్యాయలు ఎన్నికలు జరుగగా.. ఇందులో 8 పర్యాయలు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. 1957, 1962, 1967, 1971, 1977, 1980, 1989, 2008 లలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. ఇక టీడీపీ అభ్యర్థులు 6 పర్యాయలు విజయభేరీ మోగించారు. 1984, 1991, 1996, 1998, 1999, 2009 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. టీఆర్ఎస్ అభ్యర్థికి చెందిన అభ్యర్థులు 2004, 2014లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. 1952లో జరిగిన తొలి ఎన్నికలలో సోషలిస్ట్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంది.

● మూడు పర్యాయలు వేణుగోపాలచారి

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి జరిగినన 17 ఎన్నికల్లో డాక్టర్ ఎస్ వేణుగోపాలచారి మూడు పర్యాయాలు విజయం సాధించారు. టీడీపీ పార్టీ తరపున డాక్టర్ వేణుగోపాలచారి 1996, 1998, 1999లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ తరపున జీ నర్సింహారెడ్డి 1977, 1980లో జరిగిన ఎన్నికల్లో రెండు పర్యాయలు విజయం సాధించారు. ఇక ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి తొలి పర్యాయం 1952లో జరిగిన ఎన్నికల్లో సోషలిస్ట్ పార్టీ తరపున 1984లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిని సీ మాధవరెడ్డి రెండు పర్యాయలు విజయం సాధించాడు. అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి 1991లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున, 2008లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి రెండు పర్యాయలు పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందారు. 1967, 1971 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో పోద్దుటూరి గంగారెడ్డి రెండు పర్యాయాలు గెలుపొందారు.

● పార్లమెంట్ సభ్యులు వీరే..

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి తొలి పర్యాయం 1952లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సీ మాధవరెడ్డి సోషలిస్ట్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించాడు. 1957లో జరిగిన ఎన్నికల్లో కే ఆశన్న కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీ నారాయణరెడ్డి, 1967, 1971 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పీ గంగారెడ్డి గెలుపొందారు. 1977, 1980లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీ నర్సింహారెడ్డి విజయం సాధించారు. 1984లో టీడీపీ అభ్యర్థి సీ మాధవ్‌రెడ్డి విజయం సాధించగా.. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి పీ నర్సారెడ్డి గెలుపొందారు. ఇక 1991లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, 1996, 1998, 1999 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎస్ వేణుగోపాలచారిలు గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి మధుసుదన్‌రెడ్డి, 2008లో ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిలు గెలుపొందారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రమేష్ రాథోడ్, 2014లో ఎన్నికల్లో జరిగిన బీఆర్ఎస్ అభ్యర్థి గెడం నగేష్, 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావ్‌లు విజయం సాధించారు.



ఏళ్ల నాటి కల.. సాకారమైన వేళ!

● పూర్తయిన వంతెన నిర్మాణం.. కొనసాగుతున్న రాకపోకలు

ఇచ్చోడ, ఏప్రిల్ 21: ఒకప్పుడు ఇచ్చోడ నుంచి సిరిచెల్మకు వెళ్లాలంటే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉండేవి. వర్షాకాలం వచ్చిందంటే సాత్‌నంబర్ ముక్రా, జాల్దా మీదుగా దాదాపు 15 కిలోమీటర్ల దూరభారంతో ప్రయాణించాల్సి వచ్చేది. గతేడాది వర్షాకాలంలో ఇచ్చోడలోని ఆసుపత్రి వద్ద ఈ వంతెన నిర్మాణ సమయంలో వర్షం దాటికి ద్విచక్రవాహనం కొట్టుకుపోయింది. అటుగా ఆసుపత్రికి వచ్చే మహిళా రోగులు మరొకరి సహాయంతో వాగును దాటాల్సిన పరిస్థితి ఉండేది. ఆసుపత్రి పక్కనే ఈ వంతెన ఉండడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు సైతం తీవ్ర అవస్థలకు గురయ్యేవారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు మండల,జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజాపాలకులకు మొరపెట్టుకుంటే స్పందించి గతేడాది రూ. 1కోటి 50లక్షలు వెచ్చించి ఇక్కడ వంతెన నిర్మించటంతో రవాణా సదుపాయాలు మెరుగుపడ్డాయి. ఇక వాగులో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పోయింది. అప్పటితో పోలిస్తె ఇప్పుడు వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. గత జూలైలో వచ్చిన వరదల తరుణంలో కొద్దిరోజుల పాటు వంతెన వద్ద రాకపోకలు ఆగడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వంతెన పూర్తవ్వడంతో వంతెనపైనుంచి రాకపోకలు కానసాగుతున్న వేళ.. సిరిచెల్మ వైపునున్న జామిడి, గేర్జం, చించోలి, నవేగాం, దరంపూరి, మాన్కాపూర్, మల్యాల, కేశవపట్నం, గుండాల, నర్సాపూర్, గుండి, గుండావాగు, మేడిగూడ, సల్యాద ఇలా తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై వర్షాకాలంలో ఎంతపెద్ద వరద వచ్చిన భయం లేకుండా జాగ్రత్తగా తమ స్వగ్రామాలకు చెరుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల కల సాకారమైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు గ్రామీణ ప్రాంత ప్రజలు, వాహనదారులు.





ఇచ్చోడలోని ఆసుపత్రి వద్ద వంతెన పైనుంచి వెళ్తున్న వాహనాలు

కంఠంలో ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రత్యేక పూజలు

జైనథ్ రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని కంఠం గ్రామంలో గ్రామస్థుల భాగస్వామ్యంతో నూతన రామాలయంలో ఆదివారం సీతారామలక్ష్మణ తదితర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో డప్పులు భజాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థులంతా చందాలు పోగుచేసి ఆలయాన్ని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే జీవితంలో మానసిక ప్రశాంతత పొందవచ్చని అన్నారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్‌ను శాలువా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వైద్యబాలాజి, బీజేపీ నాయకులు ముక్తాపూర్ అశోక్, రాజన్న, అశోక్‌రెడ్డి, భూమన్న, రాజు, నవీన్‌లతో పాటు కంఠం గ్రామ మహిళలు, భక్తులు, ప్రజలు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, కంఠం గ్రామంలో నిర్మించిన శ్రీరామ ఆలయానికి మండలంలోని దీపాయిగూడ గ్రామ నివాసి బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధికారప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి ఆదివారం ధ్వజ స్తంభానికి, ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.లక్ష వెయ్యి రూపాయలను గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం ముందు ప్రతిష్ఠించిన ధ్వజ స్థంబానికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రామాలయంలో మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఘనంగా త్రిశక్తి దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 21:మావల మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రీన్‌వ్యాలీ కాలనీలో త్రిశక్తి దుర్గామాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. గత మూడు రోజులుగా వేద పండితుడు బ్రహ్మశ్రీ పణతుల ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రతిష్ఠాపన పూర్వక పూజ, ఆది కార్యక్రమాలు, దేవతా మూర్తులకు జలాది, దాన్యాది వాసాల క్రతువులను వేదోక్తంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఆదివారం గర్భాలయంలో అశేష భక్తుల దేవి నామస్మరణలు, వేద మంత్రాల నడుమ యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు. దీనికి స్థానిక శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం మఠాధిపతి యోగానంద సరస్వతి అతిథిగా హాజరయ్యారు. అమ్మవారి విగ్రహంతో పాటు స్థాపన దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో వేద పండితులతో కలిసి యంత్రస్థాపన చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తుల దేవి నామస్మరణలతో ఆలయం మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాతలు రమేస్‌శర్మ, సంజయ్‌శర్మ దంపతులు మఠాధిపతితో పాటు వేద బ్రహ్మణులను సత్కరించి ఆశీర్వచనాలు తీసుకు న్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ప్రతీ ఒక్కరు తమ తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవాలుగా భావించి గౌరవించాలని వారి ఆశీర్వచనాలు భగవంతుడి ఆశీర్వచనాలతో సమానమని ఈ సందర్భంగా మఠాధిపతి యోగానంద సరస్వతి ఉద్బోదించారు. వారి మనస్సును నొప్పించకుండా సేవలందించాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తద్వారా కుటుంబంలో ప్రశాంతత నెలకొంటుందన్నారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే పాయలశంకర్ పూజలు నిర్వహించారు.





ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



మాట్లాడుతున్న వేద పండితుడు ప్రవీణ్‌శర్మ



సంఘటన స్థలంలో ప్రమాదానికి గురైన వాహనాలు

అంతర్‌రాష్ట్ర రోడ్డుపై రోడ్డు ప్రమాదం

● రెండు వాహనాలు ఢీకొని 20 మందికి గాయాలు

తలమడుగు, ఏప్రిల్ 21: మండలంలోని సుంకిడి పెట్రోల్‌బంకు సమీపంలో అంతరాష్ట్ర రహదారిపై ఆదివారం తెల్లవారు జామున రెండు వాహనాలు ఢీకొని జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్లతో సహా 20మందికి తీవ్ర గాయాలు అయ్యాయని తలమడుగు ఎస్సై ధనశ్రీ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్ర నాందెడ్ నుంచి తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ 4గంటల ప్రాతంలో సుంకిడి శివారులో గల పెట్రోల్ పంపు దగ్గర టాటా మ్యాజిక్ (ఎంహెచ్26బిఈ7815, బోరేరో మ్యాక్స్‌పికప్‌గా ఎంహెచ్30ఏబీ 1252' ఎదురుగా ఢీకొన్నవి. టాటామ్యాజిక్‌లో ప్రయాణిస్తున్న వారికి రెండు వాహనాల డ్రైవర్‌లకి తీవ్ర గాయాలయ్యాయని గాయాలపాలైన వారిని 108 వాహనం ద్వారా జిల్లా కేంద్రంలో రిమ్స్‌కు తరలించడం జరిగిందని, ఇందులో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయని ఎస్సై తెలిపారు. వాహన డ్రైవర్లు నిద్రమత్తు డ్రైవింగ్‌తోనే ప్రమాదవ శాత్తు సంఘటన జరిగిందని స్థానికులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



మృతి చెందిన లేగ దూడ

చిరుత దాడిలో లేగ దూడ మృతి

తానూర్, ఏప్రిల్ 21: మండలంలోని బెంబర గ్రామంలో శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాళ్లోకి వెళ్లే.. షేక్ మౌలామియా తన వ్యవసాయ చేనులో పశువుల పాకలో ఆవును, లేగదూడను కట్టేసి ఉంచగా చిరుత పులి వచ్చి లేగదూడపై దాడి చేయడంతో లేగ దూడ మృతి చెందింది. లేగదూడ విలువ సుమారు రూ.15వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించాలన్నారు. అయితే గత పది రోజుల క్రితమే గ్రామంలో లచ్చన్న అనే రైతుకు చెందిన లేగదూడ చిరుత పులి దాడిలో మృతి చెందింది. వరుస ఘటనలతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు త్వరగా మేలుకొని మరో ప్రమాదం చోటు చేసుకోక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

తానూర్, ఏప్రిల్, 21: మండలంలోని భోసి గ్రామానికి చెందిన మరుకొండ సాయి గణేష్(16) అనే వ్యక్తి కనబడుట లేదని మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాల మేరకు గణేష్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి స్కూలుకు ఎగ్జామ్స్ రాయడానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చినాడు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఇంటి నుంచి ఆడుకోవడానికి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఎత్తు 5.6 చామన చాయ రంగు కలిగి పసుపు రంగు టీ షర్ట్, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

లక్ష్మణచాంద, ఏప్రిల్ 21: మండల కేంద్రమైన లక్ష్మణచాంద మాజీ సర్పంచ్ బిట్లింగ్ నారాయణ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు 6వ వార్డు తాజా మాజీ సభ్యులు ఎం.గణేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ సంఘటితమై పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకే ఓటేసి ఆత్రం సుగుణను గెలిపించి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.3 । కనిష్ఠం 27.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 22 ఏప్రిల్ 2024





ఎంపీ స్థానంపై.. గురి

- నేడు జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్‌కు హాజరు
- డైట్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ
- జన సమీకరణకు కాంగ్రెస్ పార్టీ నేతల కసరత్తు
- గట్టిబందోబస్తును ఏర్పాటు చేసిన జిల్లా పోలీసులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 21: లోక్‌సభ ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం జిల్లాకు రానున్నారు. జిల్లా నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం రేవంత్‌రెడ్డికి సెంటిమెంటుగా మారిందంటున్నారు. గడిచిన అసెంబ్లీ న్నికల సమయంలోనూ ఇంద్రవెల్లి నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అదేమాదిరిగా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని కూడా ఇక్కడి నుంచే మొదలు పెట్టనున్నారు. జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు. మొదట పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణ నామినేషన్‌కు హాజరుకానున్నారు. ఆ తర్వాత బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇప్పటికే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. సుమారుగా 50వేల మంది జన సమీకరణ చేసి సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. సభకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారానికి రావడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ కనిపిస్తుంది.

పార్టీ క్యాడర్‌లో జోష్ నింపేందుకు..

సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్‌కు హాజరై పార్టీ క్యాడర్‌లో మరింత జోష్ నింపేందుకు జిల్లాలో పర్యటిం చనున్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీఎం రాకతో జిల్లా రాజకీయం మరింత హీటెక్కనుంది. బీజేపీ బలంగా ఉన్న పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల నామినేషన్‌కు ముఖ్యమంత్రి హాజరవు తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎలాగైనా లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి తీరాలనే పట్టుతో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తుంది. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు ధీటుగా కాంగ్రెస్ ఆదివాసీ మహిళా అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపి మహిళ ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తుందన్న టాక్ వినిపిస్తోంది. మహిళలకు కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తుందని చెప్పుకునే ప్రయత్నం కూడా చేస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ మహిళ అభ్యర్థిని లోక్‌సభ బరిలో దింపి విపక్షాలకు సవాల్ విసురుతోంది. ఆదివాసీ ఓట్లతో పాటు ఇతర వర్గాల ఓట్లను తన ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంమది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థితో పాటు సీనియర్ నేతలు, పార్టీ ఇన్‌చార్జీలు ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించి ప్రజల్లోకి వెళ్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పర్యటన ఖరారైంది. సోమవారం ఉదయం 9.15నిమిషాలకు ముఖ్యమంత్రి నివాసం నుంచి బయలుదేరి 9.45 నిమిషాలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో ఆదిలాబాద్‌కు బయలుదేరి వెళ్తారు. 11గంటలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. ఆ తర్వాత పార్టీ అభ్యర్థి నామినేషన్‌కు హాజరై బహిరంగ సభను ముగించుకుని 12.30 గంటలకు నిజామాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. అయితే సీఎం సభకు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండడంతో పకడ్బందీ ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మధ్యాహ్నం వరకే బహిరంగ సభ ముగిసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా వాటర్ బాటిళ్లతో పాటు మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు. డైట్ మైదానం వరకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

సెగ్మెంట్‌కు 10వేల మంది టార్గెట్

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేసేందుకు కాంగ్రెస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే నియోజక వర్గాల వారీగా నేతలకు బాధ్యతలను అప్పగించారు. ఆదిలాబాద్ నియోజక వర్గం నుంచి సాధ్యమైనంత వరకు ఎక్కువ మందిని బహిరంగ సభకు తరలించాలని నేతలు భావిస్తున్నారు. అలాగే బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్, నిర్మల్, ముథోల్ నియోజక వర్గాల నుంచి 10వేల మంది చొప్పునసభకు తరలించాలని నిర్ణయించారు. జన సమీకరణ బాధ్యత నియోజక వర్గాల ఇన్‌చార్జీలకు అప్పగించి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క పర్యవేక్షణ చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు మహిళలు, యువతను తరలించే విధంగా ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ నేతలకు ఆదేశాలు ఇచ్చారు. కాని తీవ్రమైన ఎండలతో సీఎం సభకు ఏ మేరకు జనం హాజరవుతారన్నదే ఆసక్తిగా మారింది.

జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హెలీప్యాడ్ ఏర్పాట్లను పూర్తి చేశారు. అక్కడి నుంచి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశం ఉండడంతో గాంధీ పార్కు నుంచి కొమురంభీంచౌక్ మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాల యం, డైట్ మైదానం మార్గాల్లో వెళ్లే ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మళ్లిం చారు. అలాగే సీఎం సభకు తరలివచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ముఖ్య నేతలు, మీడియా వాహ నాలకు రాంలీలా మైదానంలో ఏర్పాటు చేయగా ఎరోడ్రమ్‌తో పాటు టీటీడీసీ ఎదురుగా ఉన్న మైదాన ప్రాంతంలో బస్సుల పార్కింగ్‌ను ఏర్పా టు చేశారు. అలాగే ఇతర వాహనాలకు ఆర్టీసీ డిపో ప్రదేశంలోనూ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలె త్తకుండా పోలీసులు గట్టిబందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సీఎం టూరుకు సంబంధించిన ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలి స్తున్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, కలెక్టర్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్, వినాయక్‌చౌక్ మార్గాలలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంకు వెళ్లే దారిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. మొత్తానికి సీఎం జిల్లా టూరు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



సీఎం బహిరంగ సభకు సిద్ధమైన సభా ప్రాంగణం



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ముఖ్యమంత్రి సభా ఏర్పాట్ల పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 22న జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన వేదిక, జనం ప్రవేశించే మార్గాలు తదితర విషయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. బహిరంగ సభ విజయవంతమయ్యేలా ముఖ్య నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ వ్యక్తి చట్ట సభలకు వెళ్తే సామాన్యుల పక్షాన గొంతుకగా మారి తనవాణి వినిపిస్తుందని అన్నారు. ఎన్నికల్లో ఆత్రం సుగుణను గెలిపించి అధిష్ఠానానికి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఇందులో డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు రషీద్ ఉల్‌హక్, జాఫర్‌అహ్మద్, మాజీ జడ్పీటీసీ కొండగంగాధర్, పిప్పర్‌వాడ ఎంపీటీసీ ప్రశాంత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండూరి రవి, సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, డేరా కృష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

'ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయకపోతే సీఎం రాజీనామా చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 21: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని, ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ రెండు లక్షలు ఇవ్వలేక పోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న సవాల్ విసిరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగేనైతిక హక్కు లేదన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గతంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ వాటిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా, రూ.రెండు లక్షల రుణమాఫీ, నాలుగు వేల పెన్షన్, తదితర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తుందని మండిపడ్డారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందన్నారు. సోనియాగాంధీ జన్మదినం రోజునే రెండు లక్షల రుణమాఫీ చేస్తానని గతంలో ప్రకటించిన ముఖ్యమంత్రి ప్రస్తుతం ఆగస్టు 15వ తేదీన రుణమాఫీ చేస్తానంటూ దేవుళ్ల పై ప్రమాణం చేయడం విడ్డూరమని అన్నారు. అప్పుడు కూడా రుణమాఫీ చేయక పోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. కళ్యాణలక్ష్మి నగదుతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందన్న భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్‌కు ఎనిమిది సార్లు ప్రచారానికి వెళ్లారని, సొంత పార్టీ కార్యకర్తలే హామీల గురించి వారిని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఆదివాసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇందులో ఎంపీపీ గంద్రత్ రమేష్, సెవ్వ జగదీశ్, సాజిదొద్దిన్, కొడప సోనేరావు, దమ్మపాల్, కొండ గణేష్, విజ్జగిరి నారాయణ, సంద నర్సింగ్, సంజయ్, భూమన్న, స్వాగత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి దూరంగా బీజేపీ బూత్ కమిటీల అధ్యక్షులు!!

బోథ్, ఏప్రిల్ 21: బీజేపీ ప్రచార పర్వంలో మండలంలోని కొన్ని గ్రామాలకు చెందిన బూత్ కమిటీ అధ్యక్షులు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇందుకు కారణం కొంత మంది పార్టీ నాయకులు బూత్ కమిటీలలో ఉండే వారిని పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. అయితే ఇటీవల పార్టీ అధిష్ఠానం బూత్ కమిటీల వారితో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించింది. సమావేశానికి కొంత మంది మాత్రమే బూత్ కమిటీల అధ్యక్షులు వెళ్లారు. అయితే పార్టీ హైకమాండ్ ప్రతీ బూత్ కమిటీ వారిని ఆహ్వానించింది. అందుకు ఒక్కో బూత్‌కు రూ.ఐదు వేల చొప్పున ఇవ్వాలని మండలస్థాయి నాయకులకు పంపించినట్లు సమాచారం అయితే మండలానికి వచ్చిన డబ్బులను బూత్ కమిటీల వరకు చేరవేయడంలో నాయకులు విఫలం కావడంవల్ల అలిగిన బూత్ కమిటీ అధ్యక్షులు ప్రచారానికి వెళ్లడం లేదని తెలిసింది. కాగా ఎంపీగా బరిలోకి దిగిన నగేష్ అని సార్లు ప్రచార పర్వంలో దూసుకు పోతుండగా మొదటి నుంచి పార్టీలో ఉన్న కొందరు నేతలను ఎంపీ అభ్యర్థి అనుచర వర్గం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇది ఏమైనా బీజేపీలో అంతర్గతంగా విభేదాలున్నాయి. పార్టీ అధిష్ఠానం సమన్వయం కోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

సంక్షిప్త సమాచారం

రుయ్యాడిలో ఆత్మీయ సమ్మేళనం

తలమడుగు, ఏప్రిల్ 21: మండలంలోని రుయ్యాడి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమ్మేళనం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పాల్గొని సంఘానికి అన్ని విధాలుగా ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. అదేవిధంగా ముదిరాజ్ కులస్థులు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. ముఖ్యంగా వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ఇందులో మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్‌రావు, వారితో పాటు సంఘం అధ్యక్షుడు బైండ్ల గణేష్, ముదిరాజ్ సంఘం పెద్దలు గొనేల గంగన్న, దొంతుల ఇస్తారి, బైండ్ల రమాకాంత్, లోకప్రవీణ్‌రెడ్డి, గాజుల సాంబశివ్, పోశెట్టి, బైండ్ల రామన్న, ఎన్.అశోక్, తదితరులు పాల్గొన్నారు.



పొచ్చెర గ్రామం సమీపంలోని చేలలో పడిపోయిన విద్యుత్ స్తంభం తీగలు

అధికారులు జర పట్టించుకోండి!

బోథ్, ఏప్రిల్ 21: మండలంలోని పొచ్చెర గ్రామం సమీపంలో ఉన్న ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌లైను గత కొంత కాలంగా చోరికి గురవుతోంది. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్లతో విద్యుత్ స్తంభాలని ధ్వంసం చేసి విద్యుత్ వైరు దొంగలిస్తున్నట్లు ఆ గ్రామ రైతులు పేర్కొంటున్నారు. అయితే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇకనైనా జిల్లాస్థాయి అధికారులు విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షి షా

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- మే 13న ఓటరు పండుగను నిర్వహించాలి
- ఓటు హక్కు వినియోగంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్

సిరికొండ రూరల్, ఏప్రిల్ 21: 18ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిరికొండ మండలంలోని నేరడిగొండ(జి) గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఐటిడిఏ పీఓ ఖుష్బూ గుప్తాతో కలిసి గ్రామానికి చేరుకోగా గ్రామప్రజలు డోలు వాయిద్యాలతో, మంగళహరతులతో ఘన స్వాగత పలికి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..సిరికొండ మండలంలోని మారుమూల గ్రామానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఘన స్వాగతం పలికిన తీరుపై గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. మే 13న జరిగే సాధారణ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామప్రజలు ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని. ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ రోజూ జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, స్వీప్ ప్రచార రథాన్ని గ్రామాల్లో తిప్పుతూ వందశాతం ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు డీవైఎస్వో ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధులు ఎన్నికల్లో ఓటు వేసి వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు వేయడంతో పాటు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా చైతన్య పర్చాలని అన్నారు. ఈనెల 25వ తేది నుండి మే 5 వరకు ఓటరు స్లిప్పులు పంచడం జరుగుతుందని, పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటు ఉండకూడదని, త్రాగునీరు, వీల్‌చైర్స్, తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఏర్పాటుచేయడం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గ్రామస్తులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్వో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ప్రత్యేకాధికారి ఆర్ అండ్ బి నర్సయ్య, ఐకేపి ఎపిఎం సంతోష్, డిప్యూటి తహసీల్దార్ ఉపేందర్, ఎంపీవో సంతోష్ కుమార్, ఆర్ఐ విలాస్, గ్రామస్తులు అర్క జగన్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ..



హాల్‌టికెట్ నెంబర్‌ను సరి చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు క్యూ కట్టారిలా..





పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 21: తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష కొనసాగింది. 5,506 మంది దరఖాస్తు చేసుకోగా.. జిల్లాకేంద్రంలో 23కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 4437 మంది హాజరు కాగా, 1069 మంది గైర్హాజరైనట్లు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ గంగాశంకర్ తెలిపారు.